# అమెరికా అనంతర ప్రపంచం

## ఫరీద్ జకారియా

తెలుగు సేత

టంకశాల అశోక్

ఎమెస్కో

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1 | ఇతరుల అభ్యున్నతి | 13 |
| 2 | వర్తమాన ప్రపంచం | 17 |
| 3 | పాశ్చాత్యేతర ప్రపంచం? | 51 |
| 4 | సవాలుదారు | 81 |
| 5 | అతి సన్నిహిత మిత్రదేశం | 113 |
| 6 | అమెరికా బలిమి | 143 |
| 7 | అమెరికా లక్ష్యం | 179 |
| | అధో జ్ఞాపికలు | 214 |
| | కృతజ్ఞతలు | 220 |

# 1

# ఇతరుల అభ్యున్నతి

**ఈ** పుస్తకం అమెరికా క్షీణించటం గురించి కాదు. ఇతర దేశాల అభ్యున్నతి గురించి. ఆ దేశాలతో పాటు ప్రభుత్వేతర ఆర్థిక శక్తులు, సంస్థలు, వ్యక్తుల ప్రగతి గురించి. ప్రపంచమంతటా వస్తున్న పరివర్తన గురించి.

ఈ పరివర్తనపై చర్చ తరచు జరుగుతూనే ఉంది. కాని అందుకు సంబంధించిన అవగాహన మనకు సరిగా కలగటం లేదు. ఇది సహజం. మార్పులు, అవెంత పెద్దవైనా, క్రమక్రమంగానే చోటు చేసుకుంటాయి. మనం 'కొత్తయుగ'మని మాట్లాడుతుంటాం. ప్రపంచం మాత్రం మనకు తెలిసిన పాతదానివలెనే కనిపిస్తుంది. వాస్తవానికి అందులో ఎంతో మార్పు ఉంటుంది.

ప్రపంచంలో గత 500 సంవత్సరాలలో మూడు పెను మార్పులు సంభవించాయి. ప్రపంచ శక్తుల మధ్య అధికారాన్ని పునర్విభజన చేసిన మార్పులవి. ప్రపంచ రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థలను, సంస్కృతులను అవి మార్చివేసాయి. ఆ మూడు మార్పులలో మొదటిది పాశ్చాత్య ప్రపంచ మహావిర్భావం. ఈ క్రమం 15వ శతాబ్దంలో ఆరంభమై 18వ శతాబ్ది చివరిలో మహా వేగాన్ని పుంజుకుంది. ఆధునిక యుగ లక్షణాలని మనమంటున్న శాస్త్ర-సాంకేతిక రంగాలు, అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడిదారీ విధానం, వ్యవసాయ పారిశ్రామిక రంగాలలో విప్లవాలు ఈ కాలంలో రూపుదిద్దుకున్నవే. పాశ్చాత్య దేశాలకు ప్రపంచంపై దీర్ఘకాలం పాటు రాజకీయ ఆధిపత్యం లభించటానికి మూలాలు ఈ కాలంలోనే ఉన్నాయి.

రెండవ మార్పు అమెరికా ప్రాబల్యం. ఇందుకు నాంది 19వ శతాబ్ది చివరిలో జరిగింది. అక్కడ పారిశ్రామికాభివృద్ధి తర్వాత, రోమన్ సామ్రాజ్యం అనంతరం మళ్లీ అంత శక్తిమంతమైన దేశంగా అమెరికా ఎదిగింది. తక్కిన అన్ని దేశాలు ఒకటైనా ఎంత శక్తివంతం కాగలవో, అంతకు మించిన శక్తిని అమెరికా సాధించింది. 20వ శతాబ్దంలో ఎక్కువ భాగం అమెరికా ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానిక, సాంస్కృతిక ఆధిపత్యమే కొనసాగింది. గత ఇరవయ్యేళ్ల లోనైతే ఇందుకు ఎదురులేకుండా పోయింది. ఆధునిక ప్రపంచ చరిత్రలో కనీ వినీ ఎరుగని పరిస్థితి ఇది.

# 2

## వర్తమాన ప్రపంచం

ఇది జనవరి 2000 అని, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు రానున్న సంవత్సరాల్లో ఏ విధంగా ఉండవచ్చునని మీరొక జ్యోతిష్యుడిని ప్రశ్నించారనుకొండి. రాశి చక్రంలోకి చూసేందుకు వీలుగా మీరాయనకు కొన్ని క్లూలు కూడా ఇచ్చారనుకుందాం. ఆ క్లూల ప్రకారం, అమెరికాపై చరిత్రలోనే ఎన్నడూ లేనంత తీవ్రమైన టెర్రరిస్టు దాడి జరుగుతుంది. అందుకు స్పందనగా అమెరికా రెండు యుద్ధాలకు తలపడుతుంది. వాటిలో ఇరాక్ యుద్ధం ఒకటి. ఆ చర్య వల్ల, ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద చమురునిల్వలు గల ఇరాక్ ఏళ్లతరబడి కల్లోలానికి గురవుతుంది. పశ్చిమాసియాలో ఇరాన్ బలోపేతమై అణుశక్తిని సమకూర్చుకుంటుంది. ఉత్తర కొరియా మరొక అడుగు ముందుకు వేసి ప్రపంచంలో ఎనిమిదవ అణ్వస్త్ర దేశమవుతుంది. రష్యా తన పొరుగు దేశాలతో, పాశ్చాత్య ప్రపంచంతో ఆధిపత్య ధోరణిలో వ్యవహరించటం మొదలుపెడుతుంది. లాటిన్ అమెరికాలో వెనిజుయేలా అధ్యక్షుడు హ్యూగోఛావేజ్, ఇటీవలి దశాబ్దాలలో ఎవరూ చేయనంత తీవ్రంగా పశ్చిమ దేశాలపై ఘాటైన విమర్శలు సంధించి చాలా మంది మిత్రులను, అభిమానులను సంపాదిస్తాడు. దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయిల్, హెజ్బొల్లా మధ్య పోరు జరిగి లెబనీస్ ప్రభుత్వం అస్థిరంగా మారుతుంది. దానికి పర్యవసానంగా ఇరాన్, సిరియాలు రంగప్రవేశం చేయటంతో ఇజ్రాయెల్ కలవరపడుతుంది. హమాస్ పాలనలో గాజా ఒక విఫలరాజ్యంగా మారుతుంది. ఇజ్రాయెల్, పాలస్తీనా చర్చలలో పురోగతి ఉండదు. 'ఇటువంటి పరిణామాల మధ్య ప్రపంచ ఆర్థిక పరిస్థితులు వచ్చే ఆరేళ్లలో ఏ విధంగా ఉండవచ్చు'నని మీరు జ్యోతిష్యుడిని ప్రశ్నిస్తారు.

నిజానికి ఇదంతా వట్టి ఊహాగానమేమీకాదు. ఈ విషయాలపై మనం పైన పేర్కొన్న 2000 సంవత్సరం నుంచీ నిపుణులు తమ అంచనాలు చెప్తూనే ఉన్నారు. కాని వాళ్లు చెప్పినదంతా తప్పుగా తేలింది. 2000–07 మధ్య ప్రపంచ ఆర్థికాభివృద్ధి గత నలభయ్యేళ్లలో ఎప్పుడూ లేనంత వేగంగా ఉంటుందని వారు జోస్యం చెప్పినట్లయితే అది నిజమయ్యేది. మానవుని

# 3

## పాశ్చాత్యేతర ప్రపంచం?

**1492**లో, మానవజాతి చరిత్రలోనే ఒక మహత్తరమైన సాహస యాత్రకు క్రిస్టఫర్ కొలంబస్ సమకట్టిన విషయం అందరికీ తెలిసిందే. అయితే, అంతకు 87 సంవత్సరాల క్రితమే చైనాకు చెందిన అడ్మిరల్ ఝెంగ్ హే ఇంతే గొప్ప సాహసయాత్ర సాగించాడని, ఆయన అటువంటి యాత్రలు మొత్తం ఏడు చేసాడని ఎక్కువ మందికి తెలియదు. కొలంబస్, వాస్కోడిగామా, లేదా 15, 16వ శతాబ్దాలలో సముద్రయానం చేసిన ఇతర యూరోపియన్లు అందరికన్నా అడ్మిరల్ ఝెంగ్ నౌకలు పెద్దవి, మరింత మెరుగైన నిర్మాణం కలవి. కొలంబస్ యాత్రలో ఉన్నది 4 నౌకలు, 150 మంది నావికులు కాగా, ఆ చైనా అధికారి తన మొదటి యాత్రలోనే 317 నౌకలను, 28,000 మంది మనుషులను వెంట తీసుకుపోయాడు. కొలంబస్ ప్రధానమైన నౌక శాంటా మారియా కన్న చైనీయుల ప్రధానమైన నౌకలు నాలుగు రెట్లు పెద్దవి. 400 అడుగులకుపైగా పొడవైనవి. 'సిరిసంపదల పడవలు' అనే పేరున్న ఆ నౌకలు తొమ్మిది తెరచాపలతో సాగేవి. ఒక్కొక్క నౌక నిర్మాణానికి అవసరమైన కలప కోసం 300 ఎకరాల అడవిని నరకవలసి వచ్చేది. గుర్రాలు, సరకులు, ఆహార పదార్థాలు, మంచి నీళ్లు, సైనికుల రవాణా కోసం వేర్వేరు డిజైన్ల నౌకలుండేవి. అడ్మిరల్ ఝెంగ్ నౌకా సమూహంలో అయిదు తెరచాపలతో అన్నిటికన్న చిన్నది కూడా, సుప్రసిద్ధ స్పానిష్ గ్యాలియోన్ నౌక కన్నా రెట్టింపు ఉండేది.

చైనా నౌకలను ప్రత్యేక రకాలైన కలపతో, క్లిష్టమైన అనుసంధానంతో, నీరు చొరబడకుండా అత్యుత్తమమైన సాంకేతిక నైపుణ్యంతో, అవసరాలకు తగినట్లు మార్చుకోగల సెంటర్‌బోర్డు కీల్‌తో నిర్మించేవారు. 'సిరిసంపదల పడవ'ల్లో విలాసవంతమైన పెద్ద క్యాబిన్లు, సిల్కు తెర చాపలు, కిటికీలతో హాళ్లు ఉండేవి. వాటిని ప్రపంచంలోకెల్లా పెద్దది, అత్యాధునికమైనది అయిన నాన్‌చింగ్ నౌకా కేంద్రంలో నిర్మించేవారు. 1405 తర్వాత కేవలం మూడేళ్ల కాలంలో అక్కడ 1,681 నౌకలు తయారయాయి. ఆ కాలంలో యూరోపులో దీనితో పోల్చదగిన స్థాయి నౌకా నిర్మాణం ఇసుమంతైనా జరిగి ఉండదు.[1]

# 4

## సవాలుదారు

అమెరికన్లు సౌందర్యారాధకులు కావచ్చుగాని, వారికి నిజంగా కళ్లు మిరుమిట్లు గొలిపేది సైజులే. వారికి బాగా నచ్చే గ్రాండ్ కాన్యాన్, కాలిఫోర్నియా రెడ్‌వుడ్స్, గ్రాండ్ సెంట్రల్ టర్మినల్, డిస్నీ వరల్డ్, ఎస్‌యువిలు, అమెరికన్ సైన్యం, జనరల్ ఎలెక్ట్రిక్, జున్నుతో డబుల్ క్వార్టర్ పౌడర్, వెంటి లాటే మొదలైనవన్నీ అటువంటివే. యూరోపియన్లకు సంక్లిష్టతలు, జపానీయులకు సూక్ష్మత్వాలు నచ్చుతాయి. కాని అమెరికన్లకు కావలసింది సైజులు. ఇంకా చెప్పాలంటే సూపర్ సైజులు.

అమెరికన్ మేధస్సుకు చైనా ఇంత ఆఘాతకరంగా తోచటం అందువల్లనే. చైనా ముందు అమెరికా అంగుష్టమాత్రమైనది. 130 కోట్లున్న చైనా జనాభాలో అమెరికాది నాలుగో వంతే. 100 కోట్ల మందిని క్రిష్టియన్లుగా మార్చాలని, 200 కోట్ల మంది బాహు మూలాల కోసం డియోడరెంట్లు విక్రయించాలని అమెరికన్ మిషనరీలు, వ్యాపారులు వందేళ్లుగా కలలు కంటున్నారు. కాని అవి కలలుగానే మిగిలాయి. చైనా చాలా పెద్దదే గాని చాలా పేదదేశం. పెరల్ బక్ నవల 'గుడ్ ఎర్త్'లో వర్ణించిన వ్యవసాయిక సమాజం, రైతుల కడగండ్లు, దురాశాపరులైన భూస్వాములు, కరువు కాటకాలు, వరదలు, ప్లేగు, పేదరికం చైనా గురించి చెదరని ముద్ర వేసాయి.

"చైనాను నిద్రావస్థలోనే ఉండనివ్వండి. అదేగాని మేల్కొంటే యావత్ ప్రపంచాన్ని కుదిపివేయగలదు", అని నెపోలియన్ ఒకప్పుడు జ్యోతిష్కునివలె చేసిన ప్రకటన బాగా ప్రసిద్ధి పొందింది. తర్వాత దాదాపు రెండు వందల సంవత్సరాలపాటు చైనా ఆయన చెప్పిన ప్రకారమే నడుచుకున్నట్లు కనిపించింది. అది సుషుప్తావస్థలోనే ఉండిపోగా ఇతర మహాశక్తులు అక్కడ తమ క్రీడలు తాము సాగించాయి. ఒకప్పుడు చైనాను అనుకరించే స్థాయిలో ఉండిన జపాన్ ఇరవయ్యవ శతాబ్దంలో వారిని యుద్ధంలో, శాంతికాలపు అభివృద్ధిలో కూడా మించిపోయింది. రెండవ ప్రపంచ యుద్ధ సందర్భంగా అమెరికా చైనాతో స్నేహం చేసి, సహాయాన్ని అందించి,

# 5

## అతి సన్నిహిత మిత్రదేశం

**1982** వ సంవత్సర వసంతకాలంలో నేను ఒక అమెరికన్ కాలేజీలో చదువుల కోసం వెళ్లేందుకు బొంబాయి శాంతాక్రజ్ విమానాశ్రయంలో ఎయిర్ ఇండియా విమానం ఎక్కాను. ఇండియాలో అంతకు ముందటి దశాబ్దకాలమంతా సామూహిక నిరసనలు, అల్లర్లు, వేర్పాటు ఉద్యమాలు, సాయుధ పోరాటాలు, ఆత్యయికపరిస్థితి రూపంలో ప్రజాస్వామ్యాన్ని సస్పెండ్ చేయటం వంటి పరిణామాలతో అలజడిగా సాగింది. దీనంతటికి మూలకారణం స్వల్పస్థాయి ఆర్థికవృద్ధి, క్రమంగా పెరిగే ద్రవ్యోల్బణం, వెరసి ఒక బలహీనమైన ఆర్థికవ్యవస్థ అని చెప్పాలి. ఆ కారణంగా జనాభా పెరుగుదలకు, ఆర్థికవృద్ధి రేటుకు దాదాపు తేడా లేకుండా పోయింది. అప్పటి తలసరి జిడిపి పెరుగుదల రేటునుబట్టి, ఒక సాధారణపౌరునికి తన ఆదాయం రెట్టింపు కావాలంటే, 57 సంవత్సరాలు తీసుకునే స్థితి ఉండేది. ఆ స్థితిలో తగిన అర్హతలు, కోరికలు గల భారతీయులు, తమ భవిష్యత్తు బాగుండాలంటే దేశాన్ని వదలి వెళ్లటం తప్ప మరో మార్గం లేదనుకునేవారు. ఆ విధంగా 1980లలో 75%కి పైగా ఐఐటి పట్టభద్రులు అమెరికాకు వలస పోయారు.

కాని 1997 తర్వాత దశాబ్దకాలంలో అనేకమైన మార్పులు సంభవించాయి. దేశం ప్రశాంతంగా, సుస్థిరంగా, సంపద్వంతంగా మారింది. వేర్పాటువాదం, తీవ్రధోరణులు గల జాతివాదాలు అంతరించిపోయాయి. జాతీయప్రభుత్వం, పలు రాష్ట్రప్రభుత్వాలు శాంతియుతంగా చేతులు మారాయి. చివరకు పాకిస్థాన్‌తో గల చిరకాల ఉద్రిక్తతలు సైతం కొంత సాధారణ స్థితికి చేరాయి. దీనంతటికీ మూలం ఆర్థికపరివర్తన. ఆ దశాబ్ద కాలమంతా సగటున 6.9% చొప్పున పెరిగిన ఆర్థికవ్యవస్థ, చివరి అయిదేళ్లలో 8.5%కి చేరింది. ఈ ద్వితీయార్ధపు రేటునే తర్వాతికాలంలో ఇండియా నిలుపుకొనగలిగితే, సగటు పౌరుని ఆదాయం రెట్టింపు అయేందుకు పదేళ్లు కూడా అవసరం లేదు. నూతన ఆర్థికవిధానాల ప్రభావం కనిపించటం అప్పటికే మొదలైంది. దారిద్ర్యం నుంచి బయటపడినవారి సంఖ్య అంతకు ముందటి యాభైఏళ్లలో ఎంతో, ఆ ఒక్క దశాబ్దకాలంలో అంతకన్నా ఎక్కువుంది.

# 6

## అమెరికా బలిమి

**1897**, జూన్ 22న ప్రపంచవ్యాప్తంగా సుమారు 40కోట్ల మందికి, లేదా ప్రపంచ జనాభాలో నాలుగో వంతు మందికి, ఒక రోజు సెలవు లభించింది. విక్టోరియా మహారాణి బ్రిటిష్ సామ్రాజ్యసింహాసనాధీశురాలై ఆ రోజుకు 60 సంవత్సరాలు. ఆ వజ్రోత్సవాలను భూతలంపై, సముద్రజలాలపై అయిదు రోజుల పాటు నిర్వహించారు. వాటికి జూన్ 22న పెరేడ్, థ్యాంక్స్ గివింగ్ కార్యక్రమాలతో ముగింపు జరిగింది. బ్రిటిష్ సామ్రాజ్యంలోని స్వయం పాలన ప్రతిపత్తి గల పదకొండు వలస దేశాల ప్రధానమంత్రులు, తక్కిన ప్రపంచరాజ్యాలకు చెందిన రాకుమారులు, రాజప్రతినిధులు, రాయబారులు, ప్రత్యేకప్రతినిధులు, ఆ కార్యక్రమాలకు హాజరయారు. యాభైవేల మంది సైనికులు పాల్గొన్న ఆ సైనిక ఊరేగింపులో కెనడా, న్యూ సౌత్ వేల్స్ నుంచి ఆశ్వికులు, నేపుల్స్ నుంచి కెరాబినీర్లు, బికనేర్ నుంచి ఒంటెల దళం వారు, నేపాల్ నుంచి గూర్ఖాలు, మరెందరెందరో ఉన్నారు. ఆ దృశ్యాన్ని చరిత్రకారుడొకరు రోమన్ సామ్రాజ్యకాలంతో పోల్చుతూ “ఎ రోమన్ మొమెంట్” అన్నాడు.

ఆ ఉత్సవాలు బ్రిటిష్ సామ్రాజ్యపు నలుదిశలా అట్టహాసంగా సాగాయి. హైదరాబాద్‌లో పది శాతం మంది ఖైదీలను విడుదల చేశారని, రంజాన్‌లో గ్రాండ్‌బాల్ నృత్యం జరిగిందని, జాంజిబార్ సుల్తాన్ రాజభవనంలో విందు నిర్వహించారని, టేబుల్ బే లో గన్ బోట్లు సెల్యూట్ చేశాయని, ఫ్రీటౌన్‌లో ‘మాన్‌స్టర్ సన్‌డే-స్కూల్ ట్రీట్’ ఏర్పాటు చేసారని, హాంగ్‌కాంగ్ హ్యాపీవ్యాలీలో హలెలూయా ఆలపించారని జేమ్స్ మారిస్ రాశాడు. బెంగళూరులో మహారాణి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, విశాఖపట్నానికి కొత్త టౌన్ హాలు వచ్చింది. సింగపూర్‌లోని పాడాంగ్ మధ్యలో సర్ స్టామ్‌ఫర్డ్ రాఫిల్స్ విగ్రహం, షాంఘై (అది వలస ప్రాంతం అయినా కాదు) పబ్లిక్ గార్డెన్స్‌లో ఒక ఫౌంటెన్ ఏర్పాటయాయి. ఒటావా వీధుల్లో పదివేల మంది స్కూలు పిల్లలు బ్రిటిష్ పతాకాలతో ప్రదర్శన జరిపారు. ఇటువంటివే ఇంకా అనేకకార్యక్రమాలు జరిగాయి.[1]

# 7

## అమెరికా లక్ష్యం

**21**వ శతాబ్దపు తొలిదశను అర్థం చేసుకునేందుకు చరిత్రకారులు ప్రయత్నించినపుడు, వారు పార్స్‌లీ సంక్షోభాన్ని ఒకసారి పరిగణనలోనికి తీసుకోవాలి. మొరాకో ప్రభుత్వం జిబ్రాల్టర్ జలసంధిలో తమ తీరానికి కేవలం కొన్ని వందల అడుగుల దూరాన గల లైలాదీవికి 2002 జూలైలో 12 మంది సైనికులను పంపి, తమ జండాను అక్కడ పాతించింది. అక్కడ కొన్ని మేకలు తప్ప మనుషులుండరు. వంటల్లో వాడే పార్స్లీ మొక్కలు తప్ప అక్కడేమీ పెరగవు. అందుకే ఆ దీవికి స్పానిష్‌లో పెరెజిల్ అనే పేరు వచ్చింది. అయినప్పటికీ దానిపై సార్వభౌమత్వం ఎవరిదనే ప్రశ్నపై మొరాకో, స్పెయిన్ మధ్య వివాదం ఉంది. కనుక, మొరాకో "దురాక్రమణ"ను స్పెయిన్ తీవ్రంగా పరిగణించింది. రెండువారాల్లో 75 మంది సైనికులను ఆ దీవిపై హెలికాప్టర్లతో దింపింది. వారు మొరాకో జండాను తీసేసి, రెండు స్పానిష్ జండాలను ఎగరవేసి, మొరాకో సైనికుల్ని వెళ్లగొట్టారు. స్పెయిన్ "యుద్ధచర్య" ను ఖండించిన మొరాకో తమ దేశంలో ప్రదర్శనలు జరిపించింది. "మా ఆత్మల్ని, రక్తాన్ని నీకోసం అర్పిస్తాం లైలా!" అంటూ యువకులు నినాదాలిచ్చారు. స్పెయిన్ సైనిక హెలికాప్టర్లు దీవిపై ఎగురుతుండగా, మొరాకో తీరంలో యుద్ధనౌకలు లంగరు వేసాయి. దూరం నుంచి చూసినవారికి అదంతా తమాషాగా తోచింది. అదంతా ఎంత అర్థరహిత వ్యవహారమైనా, వారిద్దరితో ఎవరో ఒకరు మధ్యవర్తిగా మాట్లాడవలసిన అవసరం మాత్రం ఏర్పడింది.

ఆ బాధ్యత ఐక్యరాజ్యసమితిపైనో, యూరోపియన్ యూనియన్ పైనో, లేదా ఉభయ దేశాలకూ మిత్రదేశమైన ఫ్రాన్స్‌పైనో పడలేదు. అందుకు బదులు అమెరికా పెద్దమనిషి పాత్ర వహించవలసి వచ్చింది. "ఇదంతా ఏమిటి? నాకేం సంబంధం దీనితో" అనే ఆలోచనే తనకు పదేపదే కలిగిందని ఆ ఉదంతాన్ని గుర్తుచేసుకుంటూ అమెరికా విదేశాంగ మంత్రి కాలిన్ పావెల్ ఆ తర్వాత అన్నాడు. ఆ స్థితి ఆయనకు చిత్రంగా తోచింది. కాని ఇక విధిలేదని బోధపడటంతో ఆయన టెలిఫోన్ దౌత్యం సాగిస్తూ ఆ శుక్రవారం రాత్రి, మరునాడు ఉదయం